# తిరుపతి - చిత్తూరు


తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



వెంకటగిరి, జనవరి 3, ప్రభాతవార్త:
వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్తగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ప్రభుత్వ తీరుపై పలు సభలో విమర్శలు చేయడంతో ఆయనపై వేటు వేశారు. నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షులుగా రాష్ట్ర కమ్యూనిటీ బోర్డ్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా ఉన్నారు. పార్టీ సమన్వయకర్తగా అందరికీ న్యాయం జరిగే విధంగా చేస్తానని రాంకుమార్‌రెడ్డి తెలిపారు. నేదురుమల్లి కుటుంబం పార్టీ క్రమశిక్షణ కలిగిన నేతలుగా పేరు పొందారు. రాంకుమార్ రెడ్డి తండ్రి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, మాతృమూర్తి రాజ్యలక్ష్మీ మంత్రిగా పని చేశారు. రాంకుమార్‌రెడ్డికి సమన్వయకర్త బాధ్యతలు ఇవ్వడంతో పట్టణంలో ఆయన అనుచరులు బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు.

## సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు పోలీసుల అనుమతి తప్పనిసరి

### ఎస్పీ పరమేశ్వర రెడ్డి



తిరుపతి క్రైం, జనవరి 3, ప్రభాతవార్త
తిరుపతి జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో వుందని సభలు, సమావేశాలు, గుంపులు గుంపులుగా గుమిగుడటం తదితర వాటికి అనుమతి లేదని ముందస్తు అనుమతి తప్పనిసరని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండగా బహిరంగ ప్రదేశాలలో సభలు, సమావేశాలు లేదా ర్యాలీలు నిర్వహించదలచిన వారు వ్రాత పూర్వకంగా సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తప్పకుండా పొందాలన్నారు. పోలీసుల అనుమతి లేకుండా నిర్వహిస్తే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులు అవుతారని నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ముఖమే హాజరుకు ఆధారం

### - ఆందోళనలో ఉద్యోగులు, అధికారులు

కోట, జనవరి 2 ప్రభాతవార్త
బయోమెట్రిక్ హాజరు విధానం అమలులో లోపాలు తెరపైకి రావడంతో రాష్ట్రప్రభుత్వం తాజాగా అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులకు సోమవారం నుంచి ఫేసియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గత మూడునెలలుగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల్లోని ఉపాధ్యాయులతో పాటు గ్రామ సచివాలయ ఉద్యోగులు ముఖచిత్రం హాజరు నమోదు చేస్తుండగా, తాజాగా అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులకు వర్తింపచేయనున్నారు. జిల్లాలోని 72 శాఖలకు చెందిన సుమారు 40 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అందులో గరిష్టంగా 7 వేలమందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. ఆ తర్వాత రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు, వైద్య, వ్యవసాయ, ఇంజినీరింగ్ విభాగాల్లో ఎక్కువమంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి అన్ని శాఖలకు జిల్లా కార్యాలయాల్లో, 16 నుంచి మండల, గ్రామస్థాయి కార్యాలయాల్లో ముఖ ఆధారిత హాజరు విధానం అమలు చేయనున్నారు. ఈ మేరకు ఖజానా కార్యాలయానికి సమాచారం అందింది. పర్యవేక్షణకు జిల్లాలో డిఆర్‌ఓను, నోడల్ అధికారులను నియమించారు. జిల్లాస్థాయిలో ఉద్యోగుల జీతభత్యాలతో పాటు ఇతర ఆర్థిక లావాదేవీలు నడిపేది ఖజానా శాఖ కావడంతో ఆ కార్యాలయానికి హాజరు అనుసంధానం చేయనున్నట్లు సమాచారం. ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు విధాన్ని ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టం సర్వీసెస్ నిర్వహించనుంది. ఇప్పటివరకు ఆధార్ బెస్ట్ విధానంలో సిఎఫ్ఎంఎస్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో హాజరు అమలు చేశారు. నూతన విధానంలో ప్రతి ఉద్యోగి తన ఆండ్రాయిడ్ ఫోన్‌లో మాత్రమే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంది. ఫోన్‌కు జియోట్యాగ్ అనుసంధానం చేయడంతో ఆయా కార్యాలయాల ప్రాంగణంలోకి వస్తేనే యాప్ తెరుచుకుంటుంది. గత మూడురోజులుగా ఉద్యోగులకు సంబంధించిన చరవాణి ఫోన్ నంబర్, ఆధార్, ఈమెయిల్ ఐడి నంబర్‌తో పాటు సమగ్ర సమాచారాన్ని ముఖచిత్రం హాజరు విధానం సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేశారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల్లోపు విధిగా హాజరు వేయాలి. సాయంత్రం 5 గంటల తర్వాత మరోసారి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఉదయం సాయంత్రం వేళల్లో ఓ 30 నిమిషాల ముందు మాత్రమే యాప్ పనిచేస్తుంది. దీనివల్ల ఉద్యోగులు విధిగా కార్యాలయాల్లోనే ఉండాల్సి ఉంటుంది.

# తెదేపాలో ప్రక్షాళనలకు సై..!!

### ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 'పట్టు'కై అధినేత రాజకీయ వ్యూహం!!
### - ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు!!
### - కార్యకర్తలు.. కేడర్‌లో ఆత్మవిశ్వాసం నింపేందుకు 'సంసిద్ధం !!
### చంద్రబాబు నేటి నుంచి కుప్పంలో పర్యటన

కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త
ప్రతిపక్ష నేత, తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు పర్యటించనున్నారు. గతేడాది మే నెలలో ఒంగోలులో జరిగిన పార్టీ మహానాడు విజయవంతం కావడం అప్పట్లో చంద్రబాబులో కొత్త ఉత్సాహం తెచ్చిందనే చెప్పాలి. అనంతరం రాష్ట్రంలో చేపట్టిన బాదుడే బాదుడు.. తాజాగా ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాలకు ప్రజలనుంచి మంచి స్పందన లభిస్తోందనే పేర్కొనాలి. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు సభలకు జనం బ్రహ్మరథం పట్టడం ఇప్పుడు రాజకీయాల్లో హాట్‌టాఫిక్‌గా సాగుతున్న చర్చ. ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా జిల్లాల్లో పర్యటిస్తున్న తెదేపా అధినేతకు జనం నీరాజనం పలుకుతుండడంతో 'చంద్రన్న'లో ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధమే అన్న రీతిలో తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో పట్టుకు వ్యూహం :**

తన సొంత జిల్లా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవశం చేసుకునేందుకు చంద్రబాబు నాయుడు అన్ని వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే నియోజకవర్గాల నుంచి సమాచారం సేకరించుకున్న బాబు ఆయా నియోజకవర్గాల్లో పనిచేసే నేతలకే ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో తెదేపా తరపున కుప్పం నుంచి కేవలం చంద్రబాబునాయుడు మాత్రమే గెలిచారు. అయితే 2024 ఎన్నికల్లో ఆ పరిస్థితిలో మార్పు వస్తుందని అధికార పార్టీతో 'ఢీ' అంటే 'ఢీ' అనే స్థాయిలో పార్టీ తరపున ఆర్థిక,అంగ,రాజకీయబలం కలిగిన అభ్యర్థులను బరిలో దించేందుకు ఇప్పటినుంచే సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చంద్రగిరి, పుంగనూరు, శ్రీకాళహస్తి, నగరి, కుప్పం, పలమనేరు,పీలేరు నియోజకవర్గాలకు దాదాపు అభ్యర్థులు ఖరారైనట్లే.



మిగతా స్థానాల్లో సైతం త్వరగానే అభ్యర్థులను ఖరారు చేసి ప్రజల్లో ఉండేలా అధినేత వ్యూహం సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో తెలుగుదేశం పార్టీకి కంచుకోటలుగా ఉన్న నియోజకవర్గాల్లో మరలా పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు చంద్రబాబు శతవిధాలా ప్రయత్నాలు సాగిస్తూ ముందుకుసాగుతున్నారు.

**పార్టీలో 'ప్రక్షాళన'.. యువతకు ప్రాధాన్యం :**

తెలుగుదేశం పార్టీలో ప్రస్తుతం అధినేత చంద్రబాబునాయుడు యువతకు పెద్దపీట వేస్తున్నారు. పార్టీలో ఉన్న సీనియర్లు యువ నేతలకు సలహాలు, సూచనలు అందిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లేలా సిద్ధం చేశారు. దాదాపు పార్టీ పదవులు సైతం యువతకు కేటాయించడంతో వారంతా కొంత ఉత్సాహంగా పార్టీ కోసం పనిచేస్తున్నారనే సమాచారంను అధినేత తెప్పించుకున్నారు. వచ్చే ఎన్నికలు పార్టీకి 'జీవన్మరణం' సమస్యగా మారిన నేపథ్యంలో పార్టీలో పాతకొత్తకలయికలతో ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నుంచే పార్టీలో 'ప్రక్షాళన'కు శ్రీకారం చుట్టిన బాబు గతంలో మాదిరి 'రొటీన్' రాజకీయాలకు స్వస్తి పలికారనే చెప్పాలి. మరో పక్క ఈనెల 27వతేది నుంచి తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేష్ కుప్పం నుంచి యువగళం పాదయాత్ర ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తండ్రి,తనయులు ఇద్దరి పర్యటన జిల్లా తెలుగుదేశం పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం ఇవ్వనుందని కార్యకర్తలు పేర్కొంటున్నారు.

## నూతన సంవత్సరంలో వడ్డీకాసులవానికి భారీగా ఆదాయం

### -రికార్డుస్థాయిలో రూ.7.68కోట్లు



తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:
2023 నూతన ఆంగ్ల సంవత్సరం ఆరంభంలో వడ్డీకాసులవాడి హుండీకి కానుకలు రికార్డుస్థాయిలో చేకూరాయి. ఇదివరకు టిటిడి చరిత్రలోనే నమోదుకాని విధంగా వైకుంఠద్వార దర్శనాల్లో భాగంగా 2023 నూతన ఆంగ్ల సంవత్సరం, జనవరి 2 వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో భారీగా భక్తులు తిరుమలకుచేరుకున్నారు. పలువరు మంత్రులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి గోవిందుని ఆశీస్సులందుకుని కానుకలు సమర్పించారు. ఈ నేపథ్యంలో జనవరి 1న ఆంగ్లసంవత్సరం ఆరంభాన 53,101మంది భక్తులు దర్శనం చేసుకోగా కానుకలుగా హుండీలో సమర్పించిన ఆదాయం 7.68కోట్లు లభించింది. కాగా వైకుంఠ ఏకాదశిన వైకుంఠద్వారంలో 69,414మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. గత ఏడాదిలో దేవదేవుని ఆదాయం ఏ నెలకు ఆనెల రికార్డులు సృష్టించింది. రెట్టింపవుతున్న భక్తులతో బాటు కానుకలు కూడా భారీగా చేకూరాయి. 1,4416కోట్లు గత ఏడాది హుండీ ఆదాయం లభించిన విషయం విదితమే. తాజాగా తిరుమల తిరుపతి దేవస్థానం చరిత్రలోనే ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా మొట్టమొదటిసారిగా జనవరి 2న హుండీ ఆదాయం 7.68కోట్లు చేకూరడం విశేషం.

## కోటలో నీటికి కటకట

కోట, జనవరి 3 ప్రభాతవార్త
మేజర్ పంచాయతీ కోటలోని ఎన్‌జిఆర్ నగర్‌లో గత ఆరురోజులుగా నీటి సరఫరా నిలిచి పోయిందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు స్థానిక అధికారులకు తెలియజేసినా ఎలాంటి ఉపయోగం లేదన్నారు. నీళ్లు కొనుగోలు చేసుకొని స్నానాలకు, తాగునీటి అవసరాలకు వాడుకుంటున్నట్లు తెలిపారు. భూగర్భజలాలు సమృద్ధిగా ఉన్నా ఇక్కడ మాత్రం పైపులైన్ మరమ్మతులలో తీవ్రమైన జాప్యం చేశారని చెప్తున్నారు. ఇకనైనా అధికారులు నీళ్లిచ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ఆటోలో నీళ్లు తెచ్చుకుంటున్న దృశ్యం

## ప్రజారోగ్యంతో చెలగాటమా

### మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి ప్రశ్న
### బ్రిటీష్ కాలంనాటి చట్టాలతో ఆంక్షలా
### మోటార్లకు మీటర్లు రైతులు మెడకు ఉరితాళ్ళే



పెద్దపంజాణి జనవరి 3 ప్రభాతవార్త :
దేశంలో ఎక్కడావినని నాశిరకం మద్యంబ్రాండ్లను రాష్ట్రంలో ప్రభుత్వం మద్యందుకాణలద్వారా విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో సిఎం జగన్‌మోహన్ రెడ్డి చెలగాటమాడుతున్నారని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి ఆరోపించారు.మంగళవారం చిత్తూరుజిల్లా పెద్దపంజాణి మండలం బట్టందొడ్డి పంచాయతీ రామాపురంలో తెలుగుదేశంపార్టీ చేపట్టిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలు,కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రత్యేకహోదాను కేంద్రం మెడలువంచి తెస్తానని చెప్పి హోదాను తేకపోగా స్పెషల్‌స్టేటస్ పేరిట మద్యాన్ని మాత్రం అందుబాటులో తెచ్చారన్నారు.అలాగే ప్రెసిడెంట్ మెడల్,బూంబూం బ్రాండ్ల పేరిట నాశిరకం మద్యంను విక్రయిస్తు పేదలప్రాణాలు హరిస్తున్నారని ఆరోపించారు.ఎపిలో విక్రయిస్తున్న మద్యంతా వైకాపా నేతల సంస్థల్లోనే తయారౌతుందని పేర్కొన్నారు.సిఎం జగన్ రెడ్డి అర్ధరాత్రి జివోలను తెస్తూ బ్రిటీష్‌కాలాన్ని గుర్తుకు తెస్తున్నారన్నారు.అర్హులైన పేదలకు వైయస్సార్ జలకల పథకంలో ఉచితంగా వ్యవసాయ బోర్లు వేపిస్తామని చెప్పిన హామీ ఏమైంది జగన్‌రెడ్డి అంటూ ప్రశ్నించారు.రాష్ట్రంలోని తెల్లరేషన్‌కార్డుదారులకు సన్నబియ్యాన్ని ఇంటింటికే డిలవరి చేస్తామని చెప్పే నేడు చౌకదుకాణాల్లోనే పాతబియ్యాన్ని పంపిణీ చేస్తూ ప్రజలను మోసగిస్తున్నారన్నారు. సమగ్రభూసర్వే రైతులమధ్య వివాదాలు పెడుతున్నారని విమర్శించారు.తమది రైతులప్రభుత్వం అని చెప్పుకుని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ప్రభుత్వం మూడున్నరేళ్ళలో మూరపొడవు డ్రిప్ పైపునుకూడా రైతులకు ఇవ్వలేదని ఆయన విమర్శించారు.ఇది ప్రభుత్వానికి సిగ్గుగాలేదా అని ప్రశ్నించారు.సిఎం జగన్‌రెడ్డి,విధ్యుత్‌శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు రైతుల మోటార్లకుమీటర్లు బిగిస్తున్నారని ఇది రైతులమెడలకు ఉరితాళ్ళని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు ఆనంద్,మండల తెలుగు యువతఅధ్యక్షుడు నాగిరెడ్డి,చలపతి,మాజీఎంపిపి మురళీకృష్ణ,జయరామిరెడ్డి,మురహరిరెడ్డి,సుధాకర్ రెడ్డి,కోగిలేరుచెంగారెడ్డి,కృష్ణారెడ్డి,రోజారెడ్డి,మిట్టపల్లి శ్రీరాయులు, మహేందర్ రెడ్డి,వేణుగోపాల్ నాయుడు,ముబారక్,కెలవాతి సుబ్రమణ్యం,గంగప్ప, వేమారెడ్డి పార్టీ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## మళ్లీ గజరాజుల దాడులు



సదుం, జనవరి 3 ప్రభాతవార్త
సదుం మండలంలో ఏనుగులు మళ్లీ దాడులు నిర్వహించాయి. గ్రామస్థులు తెలిపిన మేరకు సోమవారం రాత్రి చెరకువారిపల్లె పంచాయతీ, జోగివారిపల్లె పంచాయతీలలోని మారుమూల పల్లెల్లో ఏనుగులు తిరిగాయి. ఈక్రమంలో చెరకువారిపల్లె పంచాయతీలోని ఉప్పరపల్లెకు చెందిన మోహన, నల్లరాళ్లపల్లెకు చెందిన గిరిబాబు, శీలయ్యగారిపల్లెకుచెందిన భాస్కర, పీరూసాహెబ్‌ల చెరకుతోటలలో తిరిగాయి. కావలసినన్ని తిని తొక్కి పంటలను నాశనం చేశాయి. అదేవిధంగా జోగివారిపల్లె పంచాయతీ పరిదిలోనినాయనివారిపల్లెకు చెందినరైతులు మహేశ్వరనాయుడు,నవీన్‌లకు చెందిన రెండెకరాల చెరకుతోటను తొక్కి వేశాయి. అదేవిధంగా బాలకృష్ణయ్యకుచెందిన మామిడిచెట్లను విరిచేశాయి. వీటన్నిటిని వీఆర్వో పురుషోత్తం మంగళవారం పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందించారు. అదేవిధంగా ఆయా గ్రామాల సర్పంచిలు అనితాకుమారి, ఐశ్వర్య, సింగిల్ విండోఅధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైకాపా సచివాలయ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి,వాటర్‌షెడ్ చైర్మెన్ జీవీరమణలు పరిశీలించారు.మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అదేవిధంగా ట్రాకర్స్ వచ్చి వాటిని తరిమివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.ఫారెస్టు సెక్షన్‌అధికారిని నియమించాలని ఆయా పంచాయతీల ప్రజలుకోరుతున్నారు.

## కన్నుల పండువగా శ్రీవారి చక్రస్నానం



వడమాలపేట, జనవరి 3 ప్రభాతవార్త:
వైకుంఠ ద్వాదశి సందర్భంగా అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి చక్రస్నానం భక్తుల గోవిందనామస్మరణలతో కన్నుల పండువగా నిర్వహించారు. మంగళవారం వేకువ జామున తిరుప్పావైతో స్వామివారిని మేల్కొలిపి ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోకోనేరు వద్ద ఉదయం 7-8 గంటల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమాచార్యుల ఆధ్వర్యంలో చక్రత్తాల్వార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం కోనేరు వద్ద చక్రత్తాల్వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల వేదమంత్రాలు, భక్తుల గోవిందనామస్మరనల నడుమ శ్రీవారి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. భక్తులు కోనేరులో స్నానమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ సాయిలు పాల్గొన్నారు.


తిరుపతి కపిలేశ్వర ఆలయంలో జరుగుతున్న తెప్పోత్సవాల్లో మంగళవారం రాత్రి సోమస్కంధమూర్తి అలంకారంలో విహరిస్తున్న స్వామివారు

# పరికరాలు ఉన్నా.. ఫలితం సున్నా..!

### ఈసిజీ, ఎక్స్‌రే, ఇతర పరీక్షలకు ప్రయివేట్ ల్యాబ్‌లకు వెళ్ళాల్సిందే..


టెక్నీషియన్ లేక ఖాళీగా ధర్శనమిస్తున్న ఎక్స్‌రే పరీక్షల గది

సత్యవేడు, జనవరి 3, ప్రభాతవార్త:
మళ్ళీ మొదలైన కరోనా భయం.. ఆస్పత్రిలో మెరుగైన వైద్యం..మికేమిభయం లేదంటూ ప్రభుత్వం ఆర్భాటపు ప్రఛారం..వాస్తవానికి అన్నీ ఉన్నా..అల్లుడినోట్లో శని అన్నట్లూ సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రిలో దాథలు, ప్రభుత్వం అందించిన వివిధ పరీక్షల పరికరాలు మూలన పడ్డాయి. వైద్యుల కొరత కొంత మేరకు తీరినప్పటికీ పరికాలు, ఇతర వస్తువులను వాడడంలో నిర్లక్ష్యం జరుగుతోంది. ప్రధానంగా

### ఇదీ సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి

ఆస్పత్రిలో ఈసిజీ మిషన్‌లు రెండు, మరో రెండు ఎక్స్‌రే మిషన్లు ఉన్నప్పటికీ టెక్నీషీయన్ లేకపోవడంతో అవి వాడకానికి దూరంగా పడిఉంది. ఇటీవల ఇక్కడ పనిచేస్తున్న టెక్నీషియన్ బదిలి చేశారు. దాంతో సమస్య ఏర్పడింది. గుండె జబ్బులకు సంబంధించి ఏదైనా అత్యవసర సమయాల్లో ఈసిజీ పరీక్ష చేసుకోవాలంటే ప్రయివేట్ ల్యాబ్‌లను పేదలు ఆశ్రయించాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. అధేవిధంగా ఎక్స్‌రే మిషన్‌లను వాడే టెక్నీషియన్ లేకపోవడంతో తుప్పు పడుతోంది. ఇక లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ యూనిట్ పరికరాలు, వాడకం మూనాళ్ళముచ్చటగానే మిగిలింది. పెద్ద ఎత్తున ఆక్సిజన్ ప్లాంట్, లైన్లు, జనరేటర్‌లు ఏర్పాటు చేశారు. ప్రత్యేకమైన టెక్నీషియన్ లేకపోవడంతో అవికూడా అలంకారప్రాయంగా మారింది. ఇక రక్తపరీక్షలు చేసుకోవాలన్నా బయటకు వెళ్ళాల్సిందే. ఇక్కడ టెక్నీషియన్ ఉన్నా పరీక్షలుకు అవసరమయ్యే కిట్‌లు లేకపోవడంతో సమస్య ఏర్పడింది. మొత్తంమీద టెక్నీషియన్‌లు లేకపోవడంతో ప్రతి పరీక్షా బయట ప్రయివేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సిన దయనీయ పరిస్థితి ఇక్కడ నెలకొంది. ప్రస్తుతం విజృంభిస్తున్న కరోనా నేపథ్యంలో జిల్లా అధికారులు యుద్ధప్రాదిపతికిన స్పందించి చర్యలు తీసుకోవాలి.

**- జిల్లా అధికారుల దృష్టికి...**

టెక్నీషియన్‌ల సమస్యను జిల్లా అధికారుల దృష్టికి ఎమ్మెల్యే ఆదిమూలం కూడా మా వినతితో తీసుకెళ్ళడం జరిగిందని ఆస్పత్రి ప్రధానవైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

సదుం,జనవరి 3 ప్రభాతవార్త



మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో మంగళవారం మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె పుట్టిన రోజును పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. మహిళా విద్యకోసం చేసిన కృషిని ప్రశంశించారు. విద్యార్థులకు తెలియచెప్పారు. పుట్టిన రోజును మహిళా ఉపాధ్యాయ దినోత్స వంగా జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి వెనుకడుగు, అవినీతికి ముందడుగు

యర్రావారిపాలెం,జనవరి 3 ప్రభాతవార్త

రాష్ట్రంలోని జగన్‌మోహనరెడ్డి పాలన అభివృద్ధికి వెనుకడుగు, అవినీతికి ముందడుగు లాగా నడుస్తోందని చంద్రగిరి నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి వంకిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కనపడాలంటే రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండాలన్నారు. గతంలోతెదేపా పాలనలో రైతాంగానికి విద్యార్థులకు, మహిళలకు అందించిన సాయంతో పాటు అభివృద్ధి చేసిన పనులను గుర్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధానకార్యదర్శి మహేష్‌నాయుడు,వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే ధ్యేయంగా బాలికలకు శిక్షణ

చౌడేపల్లి, జనవరి 3 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల ఉన్నతపాఠశాల కబడ్డీ జిల్లా బాలికల జట్టుకు గెలుపే ధ్యేయంగా శిక్షణలిస్తున్నారు. విజయనగరంలో ఈనెల 10నుంచి 13వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈక్రమంలో చిత్తూరు జిల్లా కబడ్డీ జట్టుకు పూర్తిస్థాయిలో మెలుకువలు నేర్పిస్తూ శిక్షణలిస్తున్నారు. ప్రధానోపాధ్యయురాలు పద్మజ, స్కూల్ కమిటీ ఛేర్మన్ సుధాకర్(లాజర్), పిఇటిలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్టీయు డైరీలు క్యాలెండర్లు ఆవిష్కరణ

చౌడేపల్లి, జనవరి 3 ప్రభాతవార్త



రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ (ఎస్టీయు) డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షుడు లింగమూర్తి ఆధ్వర్యంలో జడ్పీటీసీ ఎన్.దామోదర్ రాజు, ఎంపిపి జి.రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు ఆర్.సు ధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి తదితరులు ఆవిష్కరించారు. ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ పురుషోత్తం, ప్రధానకార్యదర్శి సుధాకర్‌నాయుడు, జిల్లా కౌన్సిలర్ శివరాత్రి వీరభద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దాడి చేసి గాయపరచారు.. న్యాయం చేయండి మహాప్రభూ...!

–పోలీసులను ఆశ్రయించిన బాధితులు

చౌడేపల్లి, జనవరి 3 ప్రభాతవార్త

"నా స్థలాన్ని కబ్జాయత్నానికి వస్తే అడ్డుకొనేందుకు వెళ్ళగా దాడి చేసి గాయపరచారు...న్యాయం చేయండి మహాప్రభో..." అంటూ బాధితుడు స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. బాధితుని కథనం మేరకు...మండలంలోని దిగువపల్లి పంచాయతీ బోయకొండ క్రాస్‌కు చెందిన రెడ్డెప్ప అతని కుటుంబీకులపై అదే పంచాయతీ ఆర్ఆర్ కాలనీకి చెందిన కొందరు భూమి విషయంలో అగ్రకులాల వారు స్థలం కాజేయలనే వుద్దేశ్యంతో దాడి చేసి కొట్టారని బాధితుడు రెడ్డెప్ప స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసాడు. కాగా దాడికి చెందిన వీడియో మండల వ్యాప్తంగా వైరల్ కావడంతో అందరిలో చర్చినీయాంశమైంది. కాగా బోయకొండ క్రాస్‌వద్ద గల రెడ్డెప్ప అతని కుటుంబం దాడి చేసి గాయపరచిన అగ్రకులాలవారిపైఎస్సీ,ఎస్టీకేసునమోదచేయాలనిమాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం,సమతాసైనిక్ దళ్ అధ్యక్ష, కార్యదర్శులు కూరపర్తి శ్రీనివాసులు, పెద్దన్నలు డిమాండ్ చేసారు.

## ప్రమాదంలో గాయపడ్డ వైకాపా కార్యకర్తకు ఆర్థికసాయం



కుప్పంరూరల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధి 25వ వార్డు లక్ష్మీపురంలో వైకాపా కార్యకర్త రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో మంగళవారం వార్డు కౌన్సిలర్ మణి స్పందించి అతని వైద్య ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు. బాధితుడు త్వరగా కోలుకోవాలని అతని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని కౌన్సిలర్ మణి హామీ ఇచ్చారు.

## ఘనంగా సావిత్రిబాయ్ పూలే జయంతి

కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త



దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయ్ పూలే జయంతిని స్థానిక మండల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎంపిడిఒ జానకమ్మ, ఇఒపిఆర్‌డి విజయదత్, కార్యదర్శులు ఘన నివాళులు అర్పించారు.

## అర్హులకు తప్పక సంక్షేమ పథకాల్లో లబ్ది

కుప్పంరూరల్, జనవరి 3 ప్రభాతవార్త



అర్హులైన పేదలకు తప్పక ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ది కలిగిస్తామని రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పిబి నత్తం, పైపాళ్యం, మంకలదొడ్డి, చెకు గ్నత్తం పంచాయతీల్లో నూతన పెన్షన్లను అందించారు. సిఎం జగనన్న మాట తప్పని వ్యక్తి అని అర్హులకు నవరత్నాలు పథకాలతో తప్పక లబ్ది కలిగిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జానకమ్మ, ఎంపిటిసి ఆర్ముగం, కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## కామధేనువులాంటి వ్యక్తి సిఎం జగనన్న - జడ్పీటిసి శ్రీనివాసులు

శాంతిపురం, జనవరి 3 ప్రభాతవార్త



సిఎం జగనన్న నిరుపేదల పాలిట కామధేనువు లాంటి వ్యక్తి అని జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడపల్లిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అంగవైకల్యం ఉన్న వారికి మూడువేలకు పింఛను నగదు పెంచారన్నారు. అలాగే కొలమడుగు, శివరాంపురం, ఎబిదొడ్డి, గుంజార్లపల్లిలో సైతం పెన్షన్లు పంపిణీ చేశారు. మండలానికి 246 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండపాణి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## శాంతిపురంలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

శాంతిపురం, జనవరి 3 ప్రభాతవార్త



స్థానిక టేలర్ స్కూల్ గ్రౌండ్‌లో మంగళవారం జెపివెల్‌నెస్ ఫౌండేషన్ అధ్వర్యంలో క్రికెట్ టోర్నీని సంస్థ అధినేత జయప్రకాష్ ప్రారంభించారు. యువతకు క్రీడల్లో ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ టోర్నీ జరుపుతున్నట్లుతెలిపారు. కుప్పంనియోజక వర్గంలో ఉన్నక్రీడాకారులకు మాత్రమే ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు నాగరాజు, సింగిరి శ్రీనివాసులు, రాయల్‌దాము, యువత పాల్గొన్నారు.

### లోకేష్ సేవలు మరువలేనివి

శాంతిపురం, జనవరి 3 ప్రభాతవార్త

శాంతిపురం పిహెచ్‌సి వైద్యాధికారిగా డా॥ లోకేష్ సేవలు మరువలేనివని జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో బదిలీ అయిన డా॥ లోకేష్‌ను ఘనంగా సత్కరించారు. మండల ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమం లో ఎంపిడిఒ హేమమాలిని, మాజీ రెస్కోఛైర్మన్ చక్రపాణిరెడ్డి, మురళి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డా॥ హరి నాథ్‌రెడ్డి, డా॥ వంశీ, ఎఎన్ఎంలు, ఆశ సిబ్బంది శ్రీవాణి, శశికళ, కోదండపాణి, లతీఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు.

బైరెడ్డిపల్లి జనవరి 3 ప్రభాతవార్త :

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటనట బైరెడ్డిపల్లి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది.స్థానికుల కథనం మేరకు పలమనేరు నుండి బైరెడ్డిపల్లికు వస్తున్న రామకుప్పం మండలం దేసినాయినిపల్లి గ్రామానికి చెందిన సోమిరెడ్డి(58),చంద్రారెడ్డిలు స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో చీలంపలి గ్రామం సమీపంలో రోడ్డుప్రకనేఉన్న సూచిక బోర్డును ఢీకొంది.ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయానిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికుల సహాయంతో 108 వాహనం ద్వారా పలమనేరు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు.

## తిరుమల భక్తులకు అన్నదానం

కల్లూరు,జనవరి 3 ప్రభాతవార్త

పులిచెర్ల మండలం కల్లూరులో మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు తిరుమల భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కర్నాటక నుంచితిరుమలకు నడచి వెళుతున్న 200 మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా తిరుమలకు నడిచి వెళ్లే భక్తులకుఅన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చంద్రబాబు కుప్పం పర్యటనను అడ్డుకోవడానికి ముందస్తు కుట్ర

– తెలుగుదేశం నాయకుల ఆరోపణ



చిత్తూరురూరల్, జనవరి 3 ప్రభాతవార్త:

సభలు, సమావేశాలు నిషేధిస్తూ జగన్మోహనరెడ్డి సర్కారు విడుదల చేసిన జీవో బ్రిటీష్ పాలనను తలపిస్తోందని టిడిపి అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్, తెలుగు యువత అధికార ప్రతినిధి వరుణ్‌లు ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు సభలకు వస్తున్న జనాన్ని చూసి భయపడి ఇటువంటి జీవోలు ఇస్తున్నారని, కొన్ని ప్రత్యేక పరిస్థితులలో సమావేశాలకు అనుమతి ఇస్తామని చెప్పడం ఇవి కేవలం వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలకు మాత్రమే వర్తిస్తుందని, ఇతర పార్టీలకు వర్తించదని పేర్కొన్నారు. కేవలం లోకేష్‌బాబు పాదయాత్ర, పవన్‌కళ్యాణ్ బస్సుయాత్రను అడ్డుకోవడానికి ముందస్తుగా వేసిన ప్రణాళిక తప్ప మరొకటి కాదన్నారు. రేపు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు చేపట్టనున్న పర్యటనను అడ్డుకోవడానికి ఇటువంటి జీవోను విడుదల చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా క్రిస్టి యన్ సెలల్ అధ్యక్షుడు మేషక్, జిల్లా వాణిజ్యవిభాగం ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ చౌదరి, తవణంపల్లి బిసి సెల్ అధ్యక్షుడు వినాయక, పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కృష్ణమూర్తి యాదవ్‌పాల్గొన్నారు.

## అంటువ్యాధుల నివారణకు అంకితభావంతో పనిచేయాలి

తవణంపల్లె, జనవరి 3 ప్రభాతవార్త:



మండలంలో అంటువ్యాధుల నివారణకు వైద్యసిబ్బంది అంకితభావంతో పనిచేయాలని మండల వైద్యాధికారులు డాక్టర్ దాత్రేయ చౌదరి, డాక్టర్ ప్రియాంకలు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో 2023 నూతన సంవత్సర వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈమేరకు పీహెచ్‌సీ ఆవరణలో న్యూఇయర్ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా కృషి చేయాలని తెలిపారు. ఈసందర్భంగా మండల వైద్యసిబ్బంది వైద్యాధికారులు దాత్రేయ చౌదరి, ప్రియాంకలను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సీహెచ్ఓ వెంకట రమణ, పీహెచ్ఎన్ భారతి, సూపర్‌వైజర్లు అమరావతి, జయమ్మ, రాజశేఖర్, సుబ్రమణ్యంరెడ్డిలతో పాటు మండలంలోని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఐరాలలో ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

ఐరాల, జనవరి 3 ప్రభాతవార్త:



మహిళా ఉపాధ్యాయ దినోత్సవంను మండల కేంద్రం ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర వ్హించారు. సావిత్రిబాయ్ పూలె మొదటి ఉపాధ్యాయ మహిళ అని, ఆమె నిమ్నజాతి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నది, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కళాశాల ప్రన్సిపాల్ పి.రెడ్డిరామరాజు తెలిపారు అందుకోసమే మహిళా ఉపాధ్యాయ దినోత్సవంను జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా కళాశాలలోని మహిళా అధ్యాపకులు వంశీ, లత, సునీత, శ్యామల, మునిలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సురేంద్రనాయుడు, రమేష్, వెంకటరమణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే జగనన్న ధ్యేయం



–పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు

ఐరాల, జనవరి 3 ప్రభాతవార్త:

పేద ప్రజల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. మంగళవారం పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా మండలంలో నూతనంగా మంజూరైన వివిధ రకాల పింఛన్లును ఆయన లబ్దిదారులకు పంపిణీ చేశారు. అలాగే మండలంలో లబ్దిదారులకు పెంచిన పించన్లు మొత్తంను 9648 మందికి 2.56 కోట్లు రూపాయల మెగా చెక్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈనెల నుండి వివిధ రకాల పించన్‌దారులకు 2,750 రూపాయలు వంతున అందజేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ చింతం మోహన్, తహశీల్దార్ సుశీల, ఎంపీడీఓ నిర్మలాదేవి, మండల వైకాపా నాయకులు దేవేంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, రాజేష్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## గూడలిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట, జనవరి 3, ప్రభాతవార్త

కోట మండలం గూడలి గ్రామ పంచాయతీలోని గ్రామంలో మంగళవారం రాత్రి గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా లబ్ధిదారుడికే చేరేటట్లు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిని ప్రజలు మెచ్చుకుంటున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కూడా సంక్షేమ పథకాలే వైసీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయని చెప్పారు. గతంలో చంద్రబాబు ఎన్నో మోస పూరిత మాటలు చెప్పారని ఆందు వలన 2019 ఎన్నికల్లో ఆయనను ప్రజలు ఇంటికి పంపారని గుర్తు చేశారు. అనంతరం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ మైనార్టీ నాయకులు షెక్. మోబిన్ భాష మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలును మన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారని పేర్కొన్నారు.గతంలో ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి నేరుగా ఎవరో అందచేశారో ఒక్క సారి ప్రజలు బేరిజు వేసుకొవాలని కోరారు. అర్హతే ప్రమాణికంగా తీసుకుని కుల మతాలకు, పార్టీలకు అతీతంగా జగనన్న పథకాలను అందచేస్తున్నారని మోబిన్ బాష గుర్తు చేశారు. మన శాసన సభ్యులు మనస్సున్న మంచివారని,అందరికి అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. అంతకు ముందు ప్రకాశం కాలనీలో పర్యంటిచి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో , ఎంపిడిఓ మార్రెళ్ల భవాని, ఆర్‌డబ్లుఎస్ ఎఇ హెమంత్ కుమార్, మండల వైకాపా కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కిరణ్ కుమార్, ఎపిఎం రత్నయ్య, అంగన్‌వాడీ టిచర్, వై.రమణమ్మ, సచివాలయ సిబ్బంది, వాలింటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న భూ రక్షా భూ హక్కు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు డివిజనల్ పంచాయితీ అధికారి వెంకటరమణ



ఓజిలి, జనవరి 3, ప్రభాతవార్త

ఓజిలి మండలంలోని పినపరిపాడు, రాఘవరెడ్డి పాలెం, కర్జీమేడు, లింగారెడ్డిపల్లి, వాకాటి వాడి కండ్రిగ ఆయా గ్రామాల్లో గూడూరు డివిజనల్ పంచాయితీ అధికారి వెంకట్ రమణ విస్తృతంగా మంగళవారం పర్యటించి పంచాయితీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్వామిత్వా గ్రౌండ్ ట్రూటింగ్ గ్రౌండ్ ధ్రువీకరణ క్షేత్ర ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. రీ సర్వే జరిగేటప్పుడు అధికారులకు సహకరించాలని రైతులను కోరారు. రైతులు రీ సర్వే చేసుకోవడం వల్ల ఏలాంటి సమస్యలు ఉండవన్నారు. ఆయన వెంట రాజశేఖర్, ఈవోపిఆర్‌డి ఎస్.కె. సిరాజ్, ఆయా గ్రామాలకు సంబంధించిన పంచాయితీ కార్యదర్శులు, విలేజ్ సర్వేర్లు పాల్గొన్నారు.

## రాం కుమార్ రెడ్డిని కలిసిన వైసిపి రాష్ట్ర ఐటి విభాగం ప్రధాన కార్యదర్శి

ఓజిలి, జనవరి 3, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం ఇన్చార్జ్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని తాడేపల్లి నివాసంలో మంగళవారం ఓజిలి మండలం కురుగొండ గ్రామానికి చెందిన వైసిపి ఐటి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైసిపి నాయకులు జి. శ్రీనివాస్ రెడ్డి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పూల మాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు

నాయుడుపేట, జనవరి 3 ప్రభాతవార్త



నాయుడుపేట మండలం పూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యా యులు ఆదేరు సుధాకరయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సేవా తత్పరతను కొనియాడారు. ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళ, సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి విశేషంగా కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి, తొలి మహిళా ఉపాధ్యాయురాలు అని తెలియజేశారు. మహిళా ఉపాధ్యాయులు ఎం.సుజాత, జి.మంజులలను శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.రవి, సిహెచ్ అల్లెయ్య, ఎన్.నాగరాజు, మునిసుబ్బులు, ఇస్మాయిల్, హరిబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం

చిల్లకూరు జనవరి 3 ప్రభాతవార్త



మండలంలోని తమ్మినపట్టణం హరిజనవాడ గ్రామ సమీపంలో ఉన్న చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు చిల్లకూరు ఎస్ఐ బి .గోపాల్‌కి సమాచారం ఇవ్వడంతో సిబ్బందితో కలిసి చెరువు వద్దకు చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని బయటకు తీసి క్రమంలో ఉన్నారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## వైకాపా నేత దామోదర్ రెడ్డికి ఘన సన్మానం

వాకాడు, జనవరి 3, ప్రభాతవార్త

నూతన సంవత్సర వేడుకలో భాగంగా మంగళవారం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వాకాడు సొసైటీ అధ్యక్షులు, వైకాపా సీనియర్ నేత కొడవలూరు దామోదర్ రెడ్డికి శాలువా కప్పి పూల మాల వేసి ఘనంగా నిర్వహించారు. సన్మానించిన వారిలో ఎంపిడిఓ గోపినాథ్, ఎంఈఓ బాబు, వాకాడు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఏఎంసి డైరెక్టర్ వాకాటి జనార్ధన్ రెడ్డి, ఏఎంసి సిబ్బంది, ఉప సర్పంచ్ వెంకటరత్నం, వాకాడు దేవాదాయల కమిటీ చైర్మన్ గూడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, వైకాపా నాయకులు తిరుమూరు రామచంద్రారెడ్డి, శివరామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, వాకాటి రవికుమార్, శ్రీనివాసులు, ప్రదీప్ రెడ్డి, పలువురు నాయకులు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు ఎమ్మెల్యే చేతులు మీదుగా పెన్షన్లు పంపిణీ

వాకాడు, జనవరి 3, ప్రభాతవార్త

వాకాడు మండల పరిషత్ కార్యాలయంలోని బుధవారం కొత్తగా మంజూరైన 186 పెన్షన్లు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని వాకాడు ఎంపిడిఓ గోపినాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గూడూరు శాసన సభ్యులు వెల్లగపల్లి వరప్రసాద్ రావు చేతులు మీదుగా కొత్త పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి ఉండాలన్నారు.

## కోటలో ఎంఎల్‌సి అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి ప్రచారం

కోట, జనవరి 3 ప్రభాతవార్త



కోట మండలంలో మంగళవారం తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైసీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి పలు విద్యాసంస్థల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ముందుగా తనకు ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యానగర్‌లోని బాలభారతి, కోటలోని ప్రగతి విద్యాసంస్థలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి తనను గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కొత్త పరిశ్రమలను తీసుకొస్తానని చెప్పారు. ఆయన వెంట సిద్ధవరం సొసైటీ ఛైర్మన్ పాదర్తి రాధాకృష్ణారెడ్డి, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, ఉప్పల ప్రభాకర్, విన్నమాల వెంకటాద్రి, మాజీ జడ్పిటిసి సభ్యులు ప్రసాద్‌గౌడ్, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## మద్దాలిలో ఫ్యాక్టరీ స్థలం పరిశీలన

కోట,జనవరి 3 ప్రభాతవార్త

కోట మండలం మద్దాలి గ్రామ పంచాయతీలోని మద్దాలి కండ్రిగలో ఓ ప్యాక్టరీ నిర్మాణ స్దలంను గూడూరు ఆర్డిఓ కిరణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. అయితే ఆభూములు వ్యవసాయ, వ్యవసాయతేర భూములు అనే కోణంలో ఆర్డిఓ పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి అన్ని అనుమతులు ఉన్నాయో లేవో నాని కూడా పరిశిలించనట్లు సమాచారం. ఆయన వెంట తహిశీల్దార్ పద్మావతి ఉన్నారు.

## గ్రంథాలయాలను డిజిటల్ లైబ్రరీలుగా అభివృద్ధి చేస్తాం

– జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద

నాయుడుపేట రూరల్, జనవరి 3 ప్రభాతవార్త



జిల్లాలోని గ్రంథాలయాలను డిజిటల్ లైబ్రరీలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద అన్నారు. మంగళవారం నాయుడుపేట పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సహకారంతో గ్రంథాలయాన్ని అన్ని వసతులతో అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఉచిత బియ్యం పంపిణీ

తడ, జనవరి 3 ప్రభాతవార్త



తడ మండలం గ్రద్దగుంట గ్రామంలో తెల్లరేషన్ కార్డుదారులకు ఉచిత బియ్యాన్ని డిసిఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి పంపిణీ చేశారు. పేదలందరికీ నూరు శాతం బియ్యం ఉచితంగా అందించాలన్న సదుద్దేశ్యంతో రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని సురేష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సర్పంచ్ కుప్పంపాటి కాటయ్య, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, రేషన్ డీలర్ల మండల అధ్యక్షులు నగరం రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాదలూరులో ఉచిత మెడికల్ క్యాంప్

తడ, జనవరి 3 ప్రభాతవార్త



తడ మండలం కాదలూరు పంచాయతీ కొత్త హరిజనవాడలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. పెళ్లకూరు మండలంలోని చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఈ మెడికల్ క్యాంప్ జరగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కిలివేటి విజయ్, పంచాయతీ కార్యదర్శి శేషారావు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో జామియా మసీదును అభివృద్ధి చేస్తా

– ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ

వెంకటగిరి, జనవరి 3, ప్రభాతవార్త:



ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సహకా రంతో జామియా మసీదును అభివృద్ధి చేస్తానని ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. ఛైర్‌ప ర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వం రావులను వెంకటగిరి పెద్ద మసీదు (జామియా మసీదు) హిదాయతుల్ ఇస్లాం కమిటీ ప్రెసిడెంట్ పి.గౌస్‌బాషా, సెక్రటరీ అబూబకర్, వైస్‌ప్రెసిడెంట్ హబీబుల్లా, కమిటీ సభ్యులు చాన్‌బాషా, అబ్దుల్లా, సాయి గౌరవపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పలు సమస్యలను కమిటీ సభ్యులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

## నేడు విద్యుత్ కోత

వెంకటగిరి, జనవరి 3, ప్రభాతవార్త:

పాల కేంద్రం వద్దనున్న 33 కేవీ సబ్‌స్టేషన్‌లో బుధవారం మరమ్మతుల కారణంగా వెంకటగిరి మున్సిపాలిటీ, వెంకటగిరి రూరల్, డక్కిలి మండలం, బాలాయపల్లి మండలం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ మునిరవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

## జగనన్నతోనే సంక్షేమ పథకాలు అమలు

సదుం,జనవరి 3 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి,ఎంపీపీ ఎల్లప్పలు అన్నారు. మంగళవారంమండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల కొత్తగా మంజూరైన పించన్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ మండలానికి మొత్తం 244కొత్తగా పింఛన్లు మంజూరైనాయన్నారు. గతంలో కొత్తగా పింఛన్‌లు మంజూరు కావాలంటే తెదేపా నాయకుల చుట్టూ తిరిగితేతప్ప చేసేవారు కాదన్నారు. జగనన్న వచ్చాక అర్హులైన వారికి సచివాలయాల ద్వారా నేరుగా పింఛన్లుఇంటికే వస్తున్నాయన్నారు. ఈసందర్భంగా పింఛన్‌లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, మంత్రి పీఏ మురళీకృష్ణారెడ్డి,వైకాపా కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి,సర్పంచులు శ్రీనివాసులురెడ్డి, హనుమంతురెడ్డి, నారాయణరెడ్డి,ఉషారాణి, మురళీరెడ్డి,సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ఎంపీటీసీలు మల్లికార్జున,విజయకుమారి,వాసులు పాల్గొన్నారు.

# వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి..విజయకుమార్

శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త



వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ అన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌లు ఇచ్చిన పిలుపుమేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనలతో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 21వ వార్డులో నిర్వహించారు. ఈసందర్భంగా విజయకుమార్ వార్డులోని ప్రతి ఇంటికి వెళ్ళి వారికి పలకరిస్తూ గత ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు, కరెంటు బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు బాదుడు వంటివి వివరించారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువులు, విద్యుత్తు బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు విషయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డు ప్రజలు వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని విధాలుగా నష్టపోయామని చివరికి అర్హత ఉన్న వారి ఫించన్లు, రేషన్‌కార్డులు కూడా తొలగించారని తెదేపా నాయకులు దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో 21వ వార్డు ఇన్‌ఛార్జులు మహమ్మద్, మీర్జా, చంద్రమౌళి, నాగమ్మ, సాజిద్, ఖాదర్‌బీ, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి బి.రేణుకమ్మ, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు సుబ్రమణ్యం(బుజ్జి), శ్రీలక్ష్మి, దుర్గమ్మ, షాకీరాలీ, ఆర్ముగం, ప్రకాష్‌నాయుడు, బషీర్, సుబ్బయ్య, సుబ్రమణ్యం, మణి, యాదగిరి, కాసరం రమేష్, షాజహాన్, ఖాదర్‌బాషా, డివినారాయణ, అస్మత్, గోపి, మిన్నల్‌రవి, వజ్రంకిషోర్, ఆర్ముగం, దొరబాబు, ఎంఎస్‌రెడ్డి, కెవి.ప్రతాప్, సాయి, జిలానీబాష, చాంద్‌బాషా, రామకృష్ణయాదవ్, సన్నీ, కోబాకలక్ష్మణ్, సురేష్‌నాయుడు, రవీందర్ నాయుడు, మునిరాజయాదవ్, బాబురెడ్డి, పురుషోత్తంనాయుడు మరియు తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందాల్సిందే..ఎంఎల్‌ఏ

తొట్టంబేడు, జనవరి 3 ప్రభాతవార్త



అర్హులందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందుతాయని ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవరం లేదని ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడపగడపకు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చియ్యవరం సచివాలయ పరిధిలోని చియ్యవరం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు, గ్రామస్తులు ఎంఎల్ఏకు బ్రహ్మరధం పట్టి పూలవర్షం కురిపించారు. అనంతరం ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి సంబందిత అధికారులు వెంటనే చర్యలుతీసుకోవాలని కోరారు. జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సాగిన పర్యటనలో వెంటనే నిజమైన అర్హులను వాలంటీర్లు గుర్తించి వారికి అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. చియ్యవరం గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ఎంఎల్ఏను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, తంగేళ్ళపాళెం సింగిల్‌విండో ఛైర్మన్ మోహన్‌కిషోర్‌నాయుడు, చంద్రయ్యానాయుడు, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపిటిసి వేమాలయ్య, సచివాలయ కన్వీనర్ రఘురామయ్య, సురేఖ, గంగాధర్‌ఎడ్డి, అలంకారయ్య, పెంచలయ్య, ముని, కోటి, శ్రీను, వెంకటేష్, చంద్రయ్య, పెంచలయ్య, దేవేంద్ర, వెంకటేష్‌నాయుడు, రమణయ్య, మునిరత్నం, భక్తవత్సలం, గరటారెడ్డి, డిల్లీబాబు, భాస్కర్, గంగాధరం, మణి, రాజేంద్ర,ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, మండలాధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు సకాలంలో అందించకపోతే చర్యలు..తహశీల్దార్

తొట్టంబేడు, జనవరి 3 ప్రభాతవార్త



ప్రజలు, విద్యార్థులు మీసేవ, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, మ్యుటేషన్లు సకాలంలో పనులు చేయాలని తహశీల్దార్ ఐ.సుబ్రమణ్యం సంబందిత విఆర్‌ఓలు, సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఓలు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అన్నదాతల నుంచి వచ్చిన మ్యుటేషన్లు సమగ్రంగా పరిశీలించి పనులు చేయాలని ఆదేశించారు. ఏఒక్క సర్టిఫికెట్ కూడా పెండింగ్‌లో ఉండరాదని తెలిపారు. కొత్తరేషన్‌కార్డులు పరిశీలించి లబ్దిదారులకు అందించాలన్నారు. జగనన్న హౌసింగ్ నిర్మాణాల వేగవంతంలో విఆర్‌ఓలు కూడా పాత్ర వహించి సత్వరం పూర్తయ్యేలా చర్యలుతీసుకోవాలన్నారు. అనంతరం సాయంత్రం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యంగా గ్రామాల్లో స్మశాన వాటికలు ఎక్కడెక్కడ లేవో గుర్తించి వాటికి స్థలపరిశీలన చేసి పంపాలని జాయింట్ కలెక్టర్ తహశీల్దార్‌ను ఆదేశించారు. సమావేశంలో డిప్యుటీ తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి,సీనియర్ అసిస్టెంట్ మురళీ, విఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సంఘసంస్కర్త సావిత్రిబాయిపూలే

శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త



ప్రముఖ సంఘ సంస్కర్త బడుగు, బలహీన వర్గాల ఆదినాయకుడు మరియు మొట్టమొదటి మహాత్మా బిరుదాంకితుడు స్వర్గీయ జ్యోతిబాపూలే సతీమణి సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఆధ్వర్యంలో పట్టణం, భరద్వాజ తీర్థానికి వెళ్ళేదారిలో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు మరియు రొట్టెలు పంపిణీచేశారు. వెనుకబడిన వర్గాల వారి హక్కుల పరిరక్షణకు నిరంతరం శ్రమించిన నిత్యశ్రామికురాలు, స్త్రీవిద్య కోసం సాంఘిక ఉద్యమాలు చేపట్టి పలు సంస్కరణలు తీసుకొచ్చిన ప్రముఖ సంస్కర్త, ఎందరో మహానుభావులకు మార్గదర్శకురాలిగా నిలచిన కీ.శే.శ్రీమతి సావిత్రిబాయి పూలే ఓమహోన్నత వ్యక్తి అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో బడుగులపై జరుగుతున్నఅరాచకాలకు, అణచివేత రాజకీయాలకు వ్యతిరేఖంగా పోరాడి తమ హక్కులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్క పూలే దంపతులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్ళాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, బీమాలమునికృష్ణ, చక్రాల.ఉష, డిల్లీబాబు, కన్నావరంహరిబాబు, ఎంఎస్‌రెడ్డి, కిషోర్, యాదగిరి, భాస్కర్, మణి, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈవో భువనేశ్వరికి మహిళల సత్కారం

శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త



మండల విద్యాశాఖాధికారిణి ఆర్. భువనేశ్వరిని మంగళవారం దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలు, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం మరియు సావిత్రిబాయిపూలే జన్మదినోత్సవం సందర్భంగా ఎంఈవో కార్యాలయంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు నాగార్జున, సీనియర్ నాయకులు యుగంధర్, మోహన్‌బాబు, రమేష్, చలముని, ఎంఆర్‌సి సిబ్బందిలు మహిళా సిఆర్‌పిలు ఆమెను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో లలిత, దేవిప్రియ, శాంతి, స్వప్న, కెవి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తవత్సలరెడ్డికి తెదేపా నాయకులు పరామర్శ

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 2 ప్రభాతవార్త



నియోజకవర్గంలోని తొండమనాడు గ్రామానికి చెందిన మాజీ జడ్పీటిసి దందోలు భక్తవత్సలరెడ్డిని పట్టణ తెలుగుదేశంపార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, తెదేపా నాయకులు తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, తొట్టంబేడు మండల టిడిపి అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు టి.ప్రకాష్‌రావు, మాజీ కౌన్సిలర్ ప్రసాద్‌రావులతో కలసి ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆరోగ్యపరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు

వడమాలపేట, జనవరి 3 ప్రభాతవార్త:





శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చ్, టాటా ట్రస్టు వారి సంయుక్త ఆధ్వర్యంలో వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం క్యాన్సర్‌పై ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నోరు, రొమ్ము, గర్భాశయ సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సమస్యలతో ఎవరైనా గ్రామీణ ప్రజలు బాధపడుతున్నట్లయితే అలాంటి వారికి టాటా ట్రస్టు ఉచితంగా వైద్య సేవలను, తిరుపతి నగరంలోని అలిపిరి జూ పార్క్‌కు దగ్గర ఉన్న స్వీకార్ క్యాన్సర్ ఆస్పత్రిలో అతి తక్కువ ఫీజుతో ప్రముఖ వైద్యులు చేత వైద్య సేవలు అందజేస్తున్నామని పి.వి.హేమంత్‌కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో డా. చక్రపాణి, డా. భార్గవ్, సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, పీహెచ్‌ఎన్‌ఎస్‌ఆర్ మంజుల, సూపర్‌వైజర్ గౌరి, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రెడ్డి కుమారి, స్టాఫ్ నర్సు మెహతాజ్‌లు పాల్గొన్నారు.

## నేడు కొత్త పెన్షన్ల పంపిణీ సంబరాలు

శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గానికి మంజూరు అయిన కొత్త పెన్షన్ల పంపిణి సంబరాలను బుధవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసినట్లు ఎంఎల్ఏ కార్యాయం మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. నియోజకవర్గంలో 1274 కొత్త పెన్షన్లు మంజూరు అయినట్లు వివరించారు. ఇందులో శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 253,శ్రీకాళహస్తి మండలంలో 266, తొట్టంబేడులో 208,ఏర్పేడులో 260,రేణిగుంట 287 పెన్షన్లు మంజూరు అయినట్లు తెలిసింది.ఈ మేరకు ఈ పెన్షన్ల పంపిణికి సంబంధించి భారీ ఎత్తున పండగ వాతావరణంలో ప్రచారం చేయాలని నాయకులు బావిస్తున్నట్లు తెలిసింది.మధ్యాహ్నం 'కొత్త పెన్షన్ల కు సంబంధించి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు'. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 12గంటలకు పంపిణి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.దాంతో వచ్చిన కొత్త పెన్షన్ దారులకు పెన్షన్‌తో పాటు కడుపు నిండా భోజనాలు ఏర్పాటు పనుల్లో తలమునకలయ్యారు.కొత్త పెన్షన్ దారులతో పాటు ప్రస్తుతం పెన్షన్లు తీసుకుంటున్న వారిని కూడా ఆహ్వానించారు

## కాలబైరవ క్షేత్రం సుందరీకరణకు చర్యలు: చైర్మెన్

శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధం గా దక్షిణాన వెలసిన బైరవ కోనలోని కాలబైరవ క్షేత్రం సుందరీకరణ పను లను చేపట్టనున్నట్లు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మంగవారం తెలిపారు. ఇక్కడ ఆధునీకరణ పనులు జరిపి కుంభాబిషేకం జరిపించాలనే లక్ష్యతో రూ.18లక్షలతో పది అడుగుల సిమెంటు రోడ్డును వేయిస్తున్నట్లు, అలాగే ఆలయ ప్రాకారం చుట్టూ స్టీల్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలు ప్రారంభం లోపల పనులు పూర్తి చేసి కాలబైరవ ఆలయానికి కుంభాభిషేకం జరిపించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.మంగళవారం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలసి జరుగుతున్న పనులను పరిశీలించారు.ఆయనతో పాటు పాలకమండలి సభ్యులు పసల సుమతి, పవన్ డిఇఇ శ్రీనివాస్‌రెడ్డి, ఎఇఇ వేణుగోపాల్, ఆలయఅర్చకులు మోహన్ శర్మ, కాంట్రాక్టర్ గుమ్మడి బాలకృష్ణయ్య, వైయస్ఆర్‌సి నాయకులు భాస్కర్‌ముదిరాజ్, పసల కుమార్ స్వామి,భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల అభ్యున్నతికి సేవ చేసిన మహనీయురాలు

శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త



మహిళలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషమైన కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త శ్రీమతి సావిత్రిబాయిపూలే ఒక్కరే అని బిజెపి తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్‌చంద్రప్ప అన్నారు. పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీలో 107వ పోలింగ్‌బూత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కండ్రిగ.ఉమ, బిజెపి మహిళా మోర్చా తిరుపతి జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమాసింగ్ తదితరులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ 19వ శతాబ్దంలో ప్రారంభంలోనే మహిళలు విద్యావంతులు కావాల్సిన ఆవశ్యకతను గుర్తించి వారి యొక్క హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసిన గొప్ప దార్శనికురాలు సావిత్రిబాయిపూలే ఒక్కరే అన్నారు. మహిళలకు విద్యాబుద్ధులు నేర్పడానికి తానే అధ్యాపకురాలిగా మారిన దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా గుర్తింపబడ్డారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది రమణరావు, సామాజిక సమరసత సభ్యులు సురేష్, శ్రీనివాస్, బిజెపి కార్యకర్తలు మురళీ, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తి నిర్మాణాలను సత్వరం పూర్తిచేయాలి

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 3 ప్రభాతవార్త



మండలంలోని చిందేపల్లిలో అసంపూర్తిగా నిలచిపోయన జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను మంగళవారం సిపిఐ పార్టీ జిల్లా నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే అసంపూర్తిగా ఇంటినిర్మాణాలు గోడలవరకే పరిమితం అయ్యాయన్నారు. ఈ కాలనీని నిర్మించేందుకు 172 ఎకరాల్లో సుమారు ఆరువేలమందికి ఇంటిస్థలాలకోసం ప్రభుత్వం తీసుకుందని అయితే ఇప్పటి వరకు ఒక్క ఇళ్ళు కూడా పూర్తికాలేదన్నారు. హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం జగనన్న ఇళ్ళ లబ్దిదారులకు శాపంగా మారిందన్నారు. ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం అయిపోయిందన్నారు. ఇక రెండు సంవత్సరాలైనా లేఅవుట్‌లో ఇంటినిర్మాణాలు పూర్తిస్థాయిలో జరిగే విధంగా అధికారులు చర్యలుతీసుకోవాలనానన్రు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జనమాలగురవయ్య, రాధాకృష్ణ, ఏఐటియుసి నాయకులు శివ, కార్తీక్, ఎఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి మల్లికార్జున్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# తొట్టంబేడు మండల అభివృద్ధి ఘనత ఒక్క తెదేపాదే

తొట్టంబేడు, జనవరి 3 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసిన ఘనత ఒక్క తెలుగుదేశంపార్టీదే అని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గాలిచలపతినాయుడు, మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడులు అన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌లు ఇచ్చిన పిలుపుమేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనలతో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చోడవరం పంచాయతీలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు మాట్లాడుతూ గ్రామంలో ఎంతో మందికి ఎస్సీ మరియు ఎస్టీ దివంగత నేతలు బొజ్జలగోపాలకృష్ణారెడ్డి మరియు పోతుగుంట గురవయ్యానాయుడుల ఆధ్వర్యంలో పొలాలకు సబ్సిడీ పథకంలో బోర్లు వేయించి భూములు ఇచ్చిన ఘనత, హౌసింగ్ పథకంలో ఇండ్లు నిర్మించి పేద ప్రజలను ఆదుకోవడం మరియు ఫించన్లు, రేషన్‌కార్డులు, రైతులకు సబ్సిడీ ద్వారా ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, వేరుశనగ విత్తనాలు, ఎరువులు, టార్పాలిన్ పట్టలు, వరికోత మిషన్లు వచ్చిన తెలుగుదేశంపార్టీదేఅన్నారు. గ్రామంలోసిసి రోడ్లు, మూగజీవాలైన పశువులకు నీరు త్రాగడానికి ఉపాధిహామీ పథకం కింద తొట్లు, నీరు చెట్టు పథకం కింద చెరువుల ఆధునికీకరణ అంతేకాకుండా సుమారు రూ. 2కోట్లుతో గ్రామానికి శ్రీకాళహస్తి-కాసరం మధ్యలో చోడవరం గ్రామం మీదుగా హరిజనవాడ వరకు దాదాపు మూడు కిలోమీటర్లు టెండర్లు పిలిచి శిలాఫలకాలతో సరిపెట్టుకున్నారే తప్ప రోడ్డు వేసిన దాఖలాలు లేవని వృద్ధులకు, మహిళలకు భూములు ఎక్కువగా ఉన్నాయని, ఇంటిపన్నుకట్టలేదని, 300యూనిట్లు కంటే ఎక్కువ విద్యుత్ రీడింగ్ వస్తుందని ఫించన్లు తీసుకోవడానికి అనర్హులని నోటీసులు జారీ చేయడం ఎంత వరకు సబబని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలన్నీ తీర్చడంలోరాబోవు ఎన్నికల్లో యువనాయకులు బొజ్జలసుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో ఎంఎల్‌ఏగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడు, తాతయ్య, ఎస్సీ సెల్ నాయకులు, గురునాధం, వెంకటయ్య, గురవయ్య, శంకరయ్య,శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, చెంచురామిరెడ్డి, చెంచురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భయ్యారెడ్డి, వెంకటసుబ్బయ్య, పాల్గుణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటా

నింద్ర,జనవరి 3 ప్రభాతవార్త :



నగరి నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటు వుంటూ ఆదుకుంటానని నగరి నియోజకవర్గ టిడిపి సినియర్ నాయకులు పోతుగుంట విజయబాబు తెలిపారు.మంగళవారం మండలంలోని గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కొప్పేడు గ్రామానికి చెందిన మాజీ జిల్లా యస్‌సి సెల్ అధ్యక్షుడు తంగరాజన్‌ను ఆయన పరామర్శించి 10వేలు రుపాయిలు ఆర్థిక సాయం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏసమస్య వచ్చిన తనను సంప్రదిస్తే వారికి అండగా వుంటానని భరోసా ఇచ్చారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవినాయుడు,గొల్లపల్లి మాజీ యంపిటిసి ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికా విద్యకు సావిత్రిభాయి ఎనలేని కృషి

ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త :



ఆధునిక భారతదేశంలో మొదట మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రి బాయి పూలే బాలికా విద్యా వ్యాప్తికి ఎంతో కృషి చేశారని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కాలేజీలో ఆవరణలో సావిత్రిబాయి విగ్రహానికి ప్రిన్సిపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుటుంబం, సమాజం నుంచి ఎంతో వ్యతిరేకత ఎదుర్కొన్నప్పటికీ అణగారిన వర్గాల బాలికలకు తన భర్త సహకారంతో అనేక విద్యాలయాలు స్థాపించిన సావిత్రిబాయి పూలే భారతీయ మహిళలందరికీ ఆదర్శమని తెలిపారు. అనంతరం మహిళా అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎ.దేవకి, డాక్టర్ పి.కుమారి నీరజ, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సుజల, డాక్టర్ పి.గాయత్రి, డాక్టర్ స్వాతి, డాక్టర్ వరలక్ష్మి, గౌరి, వి.వీరయ్య, టి.నరసింహులు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## కేవీబీ పురం ఏపీఎంగా చంద్రబాబు

కేవీబీ పురం, జనవరి 3 ప్రభాతవార్త:

కేవీబీ పురం వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. వరదయ్యపాళెం ఏపీఎంగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చిన చంద్రబాబు ఇక్కడ పని చేస్తున్న ఏపీఎం తిరుమలరాజు వరదయ్యపాళెంకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మండలంలోని మహిళా సంఘాల అభివృద్ధికి, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే బ్యాంకు నుంచి పొందిన రుణాలను సకాలంలో రికవరీ పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలను ముందస్తు ప్రణాళిక ద్వారా సిబ్బందితో కలసి చొరవ తీసుకుని ముందుకు వెళ్తానని అన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

కేవీబీ పురం, జనవరి 3 ప్రభాతవార్త:

కేవీబీ పురం, తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలకు సంబంధించి ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఫర్జానా, సూపర్‌వైజర్ హేమావతిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు మండలాలకు సంబంధించి నాలుగు అంగన్‌వాడీ కార్యకర్తలు, మూడు మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 20 హెల్పర్‌పోస్టు ఖాళీగా ఉన్నాయని వారు తెలిపారు. 2023 జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని వారు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు స్థానికంగా ఉంటూ ఊరి కోడలై ఉండాలని వారు తెలిపారు. కేవీబీ పురం మండలంలో మోరీస్ కండ్రిగ, వగత్తూరు, రాయపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వారు తెలిపారు. అర్హత కలిగిన వారు దరఖాస్తులను తొట్టంబేడు ఐసీడీఎస్ కార్యాలయంలో చేర్చాలన్నారు. మరిన్ని సమచారాలకు కార్యాలయాన్ని సంప్రదించాలని వారు కోరారు.

## ఫోర్టిఫైడ్ రైస్ విశిష్టత తెలుసుకోండి

నగరి, జనవరి 3 ప్రభాతవార్త:



ఫోర్టిఫైడ్ రైస్ విశిష్టత తెలుసుకోవాలంటూ మధ్యాహ్న భోజన నిర్వాహ కులకు ఎంఈవో శ్రీదేవి సూచిం చారు. మంగళవారం ఆమె నగరి పట్టంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. బియ్యం కడిగే సమయంలో తేలుతున్న బియ్యాన్ని బయటకు పంపేస్తుండటాన్ని గమనించిన ఎంఈవో ఫోర్టిఫైట్ రైస్ నీటితో కడిగే సమయంలో తేలుతుందని వాటిని తొలగించరాదని సూచించింది. ఫోర్టిఫైడ్ బియ్యంలో పోషకాలు ఎక్కువగా ఉంటుందని అది పిల్లలకు అందేలా చూడాలని హెచ్చరించారు.

## గుండెపోటుతో హోంగార్డ్ మృతి

నగరి, జనవరి 3 ప్రభాతవార్త:



పట్టణ పరిధిలోని అగ్నిపమాక కేంద్రంలో హోంగార్డుగా పని చేస్తున్న సి.మురుగేశన్(49) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. నగరి దళితవాడకు చెందిన ఆయన 2004 నుంచి హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం ఉదయం ఇంటి వద్ద గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి అగ్నిపమాక అధికారి మస్తాన్, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

## నగరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం



నగరి, జనవరి 3 ప్రభాతవార్త:

స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న నగరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను డీఎస్పీ రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందన్నారు. గెలుపు, ఓటములను భరించగల మనోధైర్యం క్రీడల ద్వారా లభిస్తుందన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడాలి కాని ద్వేషాలు పెంచుకోరాదని సూచించారు. 20 టీమ్‌లు పోటీలో పాల్గొంటుందని క్రికెట్ పోటీల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పోటీ నిర్వాహకులు అమృతరాజ్ నాడార్, గోవిందస్వామి, గోపి, బాల వర్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం

పుత్తూరురూరల్, జనవరి 3 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజులస్వామి ఆలయంలో ధనుర్మాసం తిరుప్పావై ప్రవచన సందర్భంగా రాచపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ శల్య వైద్యులు ఎన్.కృష్ణమరాజు ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు చేశారు. కీర్తి శేషులు సూరపరాజు, గంగరాజు జ్ఞాపకార్థం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన వివరించారు. అలాగే పట్టణంలోని ఆరేటమ్మ ఆలయ సమీపంలోకూడా ధనుర్మాసం సందర్భంగా పుత్తూరు పట్టణం ఆరేటమ్మ కాలనీకి చెందిన పి.గంగయ్య, పి.నీలమ్మ, పి.రామయ్య, వరలక్ష్మి, లోకేష్, యువరాజు, మోహన్, మునిలక్ష్మి, హేమంత్, లక్ష్మిప్రియ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### - ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి



కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

బాలాయపల్లి, జనవరి 3, ప్రభాతవార్త:

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ మంత్రి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన బాలాయపల్లిలో నూతనంగా మంజూరైన పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2500 రూపాయల నుంచి 2750 పింఛనును ప్రభుత్వం పెంచిందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చినట్లు చెప్పారు. పేదల కోసం 23 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. డక్కిలి, బాలాయపల్లి మండలాలకు రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరైనట్లు చెప్పారు. జయంపు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కాగా 43 ప్రభుత్వ భవనాలకు రూ.11.50 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. వెంకటగిరి - చెన్నూరు రోడ్డు రూ. 40 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అధికారులు ఉత్సాహంగా పని చేసేందుకు నూతన మండల పరిషత్, తహసీల్దారు భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి, వైసీపీ నాయకురాలు రాయి దేవిక చౌదరి, ఎంపీడీవో వినీల్‌కుమార్, తహసీల్దారు అజ్మతుల్లాఖాన్, ఏవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు అండగా వైసీపీ ప్రభుత్వం: మంత్రి రోజా

వడమాలపేట, జనవరి 3 ప్రభాతవార్త: వృద్ధులు, వితంతవులు, వికలాంగుల సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి రోజా పేర్కొన్నారు. మంగళవారం పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా వడమాలపేట మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్‌ను అందజేస్తున్నామని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని, గతంలో పింఛన్ మంజూరు కావాలంటే పింఛన్ తీసుకున్న వారిలో ఎవరో ఒకరు చనిపోతే కాని, కొత్త వారికి పింఛన్ ఇచ్చేవారు కాదని నేడు అర్హులందరికి పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. వడమాలపేట మండలంలో 5099 మందికి రూ.1.41,77,750 పెన్షన్లు ఇస్తుండగా కొత్తగా 183 మందికి రూ.5,11,000లు పెన్షన్ల నిమిత్తం మంజూరు చేశారని తెలిపారు. మండలంలో ప్రస్తుతం మొత్తం 5,282 మందికి రూ.1,46,88,750లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, తహసీల్దార్ రోశయ్య, ఏవో శేఖర్, వెలుగు ఏపీఎం మునికృష్ణారెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు లోకేశ్వర్‌రెడ్డి, ఉపేంద్రవర్మ, సర్పంచ్‌లు ధర్మయ్య, మంజుల బుజ్జిరెడ్డి, అంజమ్మ, శ్రీవిద్య, రవి, నాయకులు కరుణాకర్ చౌదరి, శేఖర్, వెంకటరెడ్డి, మునిశేఖర్, రమేష్‌రాజు, వేణు, బాల, ప్రజాప్రతినిధులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వడమాలపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

## నీటికుంటలో గల్లంతై యువకుడు మృతి



కుప్పంరూరల్, జనవరి 3 ప్రభాతవార్త మండలంలోని కృష్ణదాసనపల్లి వద్ద ఉన్న ఓ క్వారీ వద్ద నీటితో నిండిన కుంటలో గల్లంతై ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. నలుగురు స్నేహితులు మద్యం సేవించి నీటికుంటలో ఈతకు దిగారు. అయితే రవికుమారుడు నవీన్‌కుమార్ అనే యువకుడికి ఈత రాక గుంతలో గల్లంతయ్యాడు. కుప్పం ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది తాళ్ల సాయంతో కుంటలోని మృతదేహాన్ని పైకి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధి కల్పించడమే లక్ష్యం: పీడీ శ్రీనివాస్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

భాకరాపేట, జనవరి 3 ప్రభాతవార్త

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి ఉపాధి కల్పించడమే లక్ష్యం అని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 2020-21, 2021-22వ ఆర్థిక సంవత్సరం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. మండలంలోని 13 పంచాయతీలలో డిసెంబరు12 నుంచి 24 వరకు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ పనులను పరిశీలించి నివేదికలు సమర్పించారు.ఉపాధి హామీ పథకం పంచాయతీరాజ్, సెర్ప్, హౌసింగ్‌కు సంబందించిన 2334పనులకు 15.29 కోట్లు ఖర్చు చేశారు. సామాజిక తనికీలలో నేమ్‌బోర్డులు పెట్టనందుకు సిబ్బందికి రూ.59,500 ఫైన్ వేశారు. కొలతల తేడాలకు 1227రికవరికి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సింగిల విండో చైర్మెన్ సహదేవరెడ్డి, ఉపాధి హామీ కౌన్సిల్ మెంబర్‌ముత్తంశెట్టి విశ్వనాధం,,డీవీఓ భాగ్యలక్ష్మి,ఏపీడీ ప్రభావతి, అంబుడ్స్‌మెన్ రాసారాయుడు, ఏసీ వనజాక్షి,ఏపీఓలు మృత్యుంజయరావు, రెడ్డెమ్మ, ఏపీఎంలుకుమారస్వామి, రాధమ్మ, సర్పంచి మనోహర్,
ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## షిరిడి సాయిబాబా ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం





పుత్తూరురూరల్, జనవరి 3 ప్రభాతవార్త:
పుత్తూరు పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో మంగళవారం వైకుంఠ ద్వార దర్శనం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం వేకువ జామున 4.30 గంటలకు వైకుంఠ ద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలంకరణలతో సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులు స్వామివారికి విశేష పూజలు చేశారు.

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

### కమిషనర్ అనుపమ అంజలి



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కార్పొరేషన్, జనవరి 3, ప్రభాతవార్త

జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుపతి అర్బన్ పరిధిలో పేదలకు ఇండ్లు కేటాయించిన జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల పురోగతిపై ఇంజినీరింగ్, హౌసింగ్, రెవెన్యూ అధికారులతో మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతిలోని అర్హులైన పేదలకు ఏడు ప్రాంతాల్లో ఇంటి స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. ఆ నిర్మాణాల్లో ఆలస్యం జరుగుతుందని సకాలంలో పనులు పూర్తి చేయాలని లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటి నిర్మాణాల్లో నాణ్యత పాటించాలన్నారు. ప్రతి ఇంటికి కూడా హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించాలన్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో పెరిగిన మొక్కలు వెంటనే తొలగించాలన్నారు. అలాగే వీధుల్లో ఏర్పడిన గుంతలు పూడ్చి వాహనాలు సజావుగా వెళ్లి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మీరే కాకుండా లబ్ధిదారులు కూడా వచ్చి వారి ఇంటి నిర్మాణాలు చూసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే లబ్ధిదారులు కూడా వచ్చి వారి ఇంటి నిర్మాణాలు చూసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే లబ్ధిదారులు కూడా సంతృప్తిగా ఉంటారన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, గోమతి, సంజయ్ కుమార్, దేవిక, మహేష్, హౌసింగ్ డిఈ మోహన్ రావు, ఏఈ భాస్కర్, అమెనిటీ సెక్రెటరీలు తదితరులు ఉన్నారు.

### మా సభల్లో సంఘటనలు జరిగితే రద్దులు

## మరి సిఎం సభలో జరిగితే . .

### ఉడమలపాడులో 'ఇదేం ఖర్మ'లో రంగినేని చెంచయ్యనాయుడు ధ్వజం



శ్రీకాళహస్తి రూరల్, జనవరి 3 ప్రభాతవార్త

చంద్రబాబునాయుడు సభలకు వస్తున్న జనం అదుపు తప్పి, పోలీసుల పర్యవేక్షణ లేకకుండా ప్రమాదం జరిగితే రాష్ట్రానికి శని మరి మంగళవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజమండ్రి సభలో ప్రమాద సంఘటన జరిగితే ఏం చర్యలు తీసుకుంటారని మంగళవారం శ్రీకాళహస్తి మండలంలో జరిగిన తెలుగేదశం పార్టీ ఇదేం ఖర్మ కార్యక్రమాల్లో జిల్లా అధికార ప్రతినిధి రంగినేని చెంచయ్యనాయుడు ధ్వజమెత్తారు. రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం మండలంలోని ఉడమల పాడు గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒక్కచాన్సు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రగతి ఎలా ఉందో ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కృష్ణయాదవ్, యూనిట్ ఇన్‌చార్జి సతీష్, సుబ్రమణ్యం నాయుడు, నరసయ్య, పార్టీ నాయకులు బలరామ యాదవ్, వెంకటముని, మురళీ రెడ్డి, కృష్ణం నాయుడు, పవన్ రాయల్, మహేంద్ర, మహమ్మద్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠద్వాదశిన శాస్త్రోక్తంగా "చక్రస్నానమహోత్సవం"



తిరుమల, జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగవైకుంఠం తిరుమల ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాల్లో భాగంగా రెండవరోజు మంగళవారం ఉదయం వైభవంగా చక్రత్తాళ్వార్‌కు చక్రస్నాన మహోత్సవం జరిగింది. వేకువజామున ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో చక్రత్తాళ్వార్ ను ఊరేగింపుగా ఆలయానికి పక్కనేవున్న శ్రీవరాహ స్వామి ఆలయంకు ఆనుకుని ఉన్న స్వామిపుష్కరిణి సుగంధద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు, జెఇఓ వీరబ్రహ్మం, అర్చకులు పాల్గొన్నారు.

### చంద్రబాబును అరెస్టు చేస్తే

## రాష్ట్ర దరిద్రం పోతుంది

### ఎమ్మెల్యే బియ్యపు మధుసూధనరెడ్డి



శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం నాయకుడు నారాచంద్రబాబునాయుడును అరెస్టు చేసి జైలుకు పంపితే రాష్ట్రానికి పట్టిన దరిద్రం తొలగిపోతుందని శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో రూ. 8కోట్లతో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులకు భూమి పూజలు చేసిన ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు యాత్రలు, రోడ్‌షోల పేరుతో డ్రామాలేస్తూ అధికార దాహంతో పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు. శ్రీకాళహస్తిని 30 సంవత్సరాల పాటు పరిపాలించిన ఒకే ఒక కుటుంబం అభివృద్ధిని మరచి పాలించారని కానీ తాము ప్రజలకు ఎల్లవేళల్లో అందుబాటులో ఉంటూ శ్రీకాళహస్తి రూపు రేఖలు మార్చుటకు ప్రణాళికలు రూపొందించామన్నారు. గతపాలకులు ప్రజలకు నాలుగుమాడావీధుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటుకు సంబంధించి అరచేతిలో స్వర్గం చూపారని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి శివమెత్తారు. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న చంద్రబాబును అరెస్టు చేసి రాష్ట్రానికి పట్టిన శనిని తొలగించాలని కోరారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కేబుల్ పనులు మహాశివరాత్రి లోపల పూర్తి చేయటానికి కాంట్రాక్టర్ కోరామన్నారు. ఈఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఎన్నో ప్రత్యేకతలను చోటు చేసుకుంటుందని శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, లోకేష్‌యాదవ్, పిజె చంద్రయ్యశెట్టి, ఉత్తరాజి శరవన్‌కుమార్, గుమ్మడి బాలకృష్ణయ్య, కంఠా ఉదయ్ కుమార్, నాని, నరసింహారాజు, సుమతి, సునీతసింగ్, మున్నా, జయశ్యాం, శ్రీవారి సురేష్, కంచి గురవయ్య, మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు పిఎం చంద్ర, చింతామణి పాండు, సెన్నీరుకుప్పం శేఖర్, లెనిన్ బాబు, పసల కృష్ణయ్య, బాబు, సాగిరాబీ, శంకర్, గిరిగౌడ్, భాస్కర్, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో శ్రీకాకుళం ఎంపి



శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మంగళవారం శ్రీకాకుళం పార్ల మెంటు సభ్యుడు కింజారపు రామమోహన్ నాయుడు కుటుంబసమేతంగా పాల్గొ న్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇన్స్పెక్టర్ సురేష్‌రెడ్డి సారధ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయంలో శిల్పకళను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శివయ్యను దర్శనం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

## ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి

పలమనేరు జనవరి 3 ప్రభాతవార్త :

మెట్టమెదటి మహిళా ఉపాధ్యాయిరాలుగా కీర్తి గడించిన సావిత్రిబాయిపూలే జయంతిని స్థానిక కళా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగవరం, బైరెడ్డిపల్లి మండల విధ్యాశాఖాధికారులు చంద్రశేఖర్ రెడ్డి, సాయిలీలలు మాట్లాడుతూ నేటి ఉపాధ్యాయులందరూ సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకొని సమాజంలో రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా 15మంది మహిళా ఉపాధ్యాయినులు పద్మజ, కళైమతి, ఇందిర, భువనేశ్వరి, నాగరత్న, మీనాక్షి, సోఫియారాణి, లూథ్‌మేరీ, సురేఖ, చంద్రలేఖ, శారద, ప్రసన్న కుమారి, షరీన్, సునీతలను తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పి.తులసినాధం నాయుడు, కార్యదర్శి పుష్ప, ఆనంద బాబు, సీతారామయ్య, నరేంద్ర, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, సుదర్శనాచారి. బాలసుందరం, గురుమూర్తి, చిరంజీవి, చంద్రశేఖరయ్య, ఏసురత్నం తధితరులు పాల్గొన్నారు.

# కుప్పంలో చంద్రబాబు పర్యటనపై ఉత్కంఠ !!

### - కార్యదర్శి మనోహర్‌కు డిఎస్పీ నోటీసులు.. రోడ్‌షో..బహిరంగసభలపై పూర్తి వివరాలివ్వాలి!!



డిఎస్పీ సుధాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న తెదేపా నేతలు

కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త

కుప్పంలో ప్రతిపక్ష నేత, మాజీ సిఎం చంద్రబాబునాయుడు పర్యటనపై ఉత్కంఠ నెలకొంది. బుధవారం నుంచి మూడు రోజులపాటు ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి చంద్రబాబు కార్యదర్శి మనోహర్‌కు నోటీసులు అందించారు. గత నవంబర్ నెలనుంచి ఈనెల 30వతేది వరకు పలమనేరు డివిజన్ పరిధిలో పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందన్నారు. కనుక సభలు, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతులు పొందాలన్నారు. కొద్ది రోజులుగా ఇలాంటి సభలతో మన రాష్ట్రంలో జరిగిన కొన్ని అవాంఛనీయ సంఘటనల దృష్ట్యా సభలు ఇరుకురోడ్లలో గానీ, జాతీయ, రాష్ట్ర రహదారుల్లో కానీ జరపకుండా ఏదైనా విశాల స్థలంలో జరుపుకోవాల్సి ఉందన్నారు. ఈమేరకు ప్రభుత్వం జిఒఆర్‌టి నెం 1 సైతం అమలులో తెచ్చిందని నోటీసులో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పర్యటించే ప్రాంతాల్లో బహిరంగ సభలు ఎక్కడ జరుపుతారు అనే అంశంపై తమకు స్పష్టమైన వివరాలు అందించాలని అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అనుమతులు మంజూరుచేస్తామన్నారు. అలాకాక కార్యక్రమాలు కొనసాగించి వాటివల్ల ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే నిర్వాహకులపై చట్ట రీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం తెదేపా నేతలు చంద్రబాబునాయుడు పర్యటనకు సంబంధించిన వివరాలు అందించగా పూర్తి సమాచారంతో అందించాలని పోలీసు ఉన్నతాధికారులు సూచించినట్లు సమాచారం.


